# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  25-07-2024                సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శాసనసభలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈరోజు శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేశారు.
- రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  అధ్యక్షతన సచివాలయంలో మంత్రి మండలి సమావేశం ఈ రోజు నిర్వహించారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ  25వ కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా రేపు కార్గిల్ వార్ మెమోరియల్‌ను సందర్శించనున్నారు.
- గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులు 2025 జూన్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టంచేశారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" కార్యక్రమం 112వ సంచిక ఈ ఆదివారం ప్రసారమవుతుంది.

======================

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసనసభలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు శాంతిభద్రతలపై శ్వేతపత్రం విడుదల చేశారు.  ఈ సందర్భంగా మాట్లాడిన చంద్రబాబునాయుడు  శాంతిభద్రతల విషయంలో రాష్ట్రాన్ని  దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని స్పష్టం చేశారు.  రాజకీయ ప్రేరేపిత కేసులపై సమీక్షిస్తామని, అక్రమ కేసులు పెట్టిన అధికారులను శిక్షిస్తామని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.  అధికారులు చట్టాన్ని గౌరవించినప్పుడే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయన్నారు. సామాజిక మాధ్యమాల కట్టడికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని మహిళలపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిస్తూ..

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈరోజు సాయంత్రం సచివాలయంలో మంత్రి మండలి సమావేశం నిర్వహించారు. పోలవరం ప్రాజెక్టులోని డయాఫ్రం వాల్ నిర్మాణంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ నెల 27వ తేదీన ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో డయాఫ్రం వాల్ నిర్మాణ ప్రతిపాదనలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తావించనున్న నేపధ్యంలో నీతి ఆయోగ్‌లో ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తప్పనిసరి కావటంతో ప్రస్తుతం దీనిపై అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా రేపు శాసన సభలో ఆర్ధిక రంగంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్వేతపత్రం విడుదల చేయనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25వ కార్గిల్ విజయ్ దివాస్ సందర్భంగా రేపు కార్గిల్ వార్ మెమోరియల్‌ను సందర్శించనున్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులర్పిస్తారు. అనంతరం షింకున్ లా సొరంగం నిర్మాణ పనులను పరిశీలిస్తారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ సొరంగం నిము-పాడుమ్-దర్చా రోడ్‌లో దాదాపు పదిహేను వేల 800 అడుగుల ఎత్తులో నిర్మించబడుతుంది. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సొరంగం అవుతుంది. ఇది సాయుధ దళాల సామగ్రి సమర్ధవంతమైన కదలికను నిర్ధారించడమే కాకుండా లడఖ్‌లో ఆర్ధిక సామాజిక అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు లోక్ సభలో మాట్లాడిన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి గన్నవరం, విశాఖపట్టణం విమానాశ్రయాలనుంచి ఢిల్లీ, కోలకతా, ముంబై వంటి పలు నగరాలకు విమాన సర్వీసులు పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అదే విదంగా గన్నవరం విమానాశ్రయ విస్తరణ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయి అడిగిన ప్రశ్నకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానమిస్తూ.. 2025 జున్ నాటికి విమానాశ్రయ విస్తరణ పనులు పూర్తి చేస్తామని గన్నవరం నుంచి ఇతర ప్రాంతాలకు అనుసంధానం పెంచే విషయంలో ఆయా సంస్థలే నిర్ణయం తీసుకుంటాయని వివరిస్తూ....

(వాయిస్ 34 వాయిస్)

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ త్వరలో ఈ-వ్యర్ధాల రీసైక్లింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు శాసన మండలి సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. దేశంలో ఈ-వ్యర్థాలు అధికంగా ఉత్పత్తి చేసే మొదటి 3 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ లేదన్నారు. ఈ-వ్యర్థాల తొలగింపు, రీ సైక్లింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 112వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్ కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు ఉభయ సభల్లో కేంద్ర బడ్జెట్ 2024-25 పై చర్చ తిరిగి ప్రారంభమయ్యింది. అంతకముందు పాత్రికేయులతో మాట్లాడిన పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష నాయకులపై అసహనం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌పై నిర్మాణాత్మక చర్చ జరగాలని, వికసిత్ భారత్‌పై దృష్టి పెట్టాలని బడ్జెట్ సమావేశాల్లోనే బడ్జెట్‌పై చర్చ జరగాలని మంత్రి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాజ్యసభలో 2024-2025 కేంద్ర బడ్జెట్ పై ఈరోజు చర్చలో పాల్గొన్న కాంగ్రెస్‌కు చెందిన రణదీప్ సింగ్ సూర్జేవాలా రైతులు, పేదలు, నిరుద్యోగ సమస్యలను లేవనెత్తారు. రైతుల రుణమాఫీకి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నీట్ యూజీ 2024 పరీక్ష వివాదంపై ఇటీవల సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించడంతో సవరించిన ఫలితాలను ఎన్‌టీఏ ఈరోజు విడుదల చేసింది. భౌతిక శాస్త్ర విభాగంలోని ఓ ప్రశ్నకు ఒకటే సమాధానం ఉంటుందని నిపుణుల కమిటీ తేల్చడంతో దాని ఆధారంగా ఫలితాలను సవరించాలని ఆదేశించింది. ఇందులో 4.2లక్షల మంది అభ్యర్థులు 5 మార్కులను కోల్పోయారు. దీంతో మొదటి ర్యాంక్ సాధించిన వారి సంఖ్య కూడా 61 నుంచి 17కు తగ్గింది. సవరించిన ఫలితాలను విద్యార్థులు ఎన్‌టీఏ అధికారిక వెబ్‌సైట్ exams.nta.ac.inలో చూసుకోవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజమహేంద్రవరం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. ఈరోజు సాయంత్రం 4 గంటల సమయానికి 13.40 అడుగుల నీటిమట్టం ఉండగా 12 లక్షల 30 వేల 242 క్యూసెక్కుల నీటిని అధికారులు సముద్రంలోకి విడుదల చేశారు. ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద క్రమం గా తగ్గుముఖం పడుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశ రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆకాశవాణి వార్తా విభాగం ఈరోజు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రసారం చేస్తుంది. ఈరోజు రాత్రి 7.25 గంటలకు 100.1 ఆకాశవాణి గోల్డ్ తో పాటు అదనపు ఫ్రీక్వెన్సీలను ట్యూన్ చేసి ఈ ప్రత్యేక ప్రసారాన్ని వినవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ కోరారు. పార్వతీపురం ఐటిడిఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల సంస్థ, నాబార్డు తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హత, వనరులు ఉన్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పుగోదావరి జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతిపాదించిన రు. 489 కోట్లతో చేపట్టిన 670 పనుల్లో ఇప్పటివరకు 355 పూర్తయ్యా యని మరో 84 పనులు పురోగతిదశలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో డ్రైన్స్ నిర్మాణానికి రు. 19.29 కోట్లతో చేపట్టిన 243 పనుల్లో 25 పనులు పూర్తికాగా 46 పనులు పురోగతిలో ఉన్నాయని తెలియచేసారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = =